క్లుప్తంగా

మృతుని కుటుంబానికి బీమా నగదు అందజేత



రాగతి లక్ష్మికి బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. సంపాదించే వ్యక్తి దూరమైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతమని ఆమె అభిప్రాయపడ్డారు. వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాగతి రాజు అలియాస్ బద్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శనివారం బద్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా బద్రి భార్య రాగతి లక్ష్మికి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, రొంగలి వెంకటరమణ, దుంగల నీలిమ, అప్పలరాజు, వైట్, దానయ్య, ధన, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జోరువాన



డైమండ్ పార్కు ప్రధాన రహదారిలో నిలిచిన మురుగు నీరు

సీతమ్మధార: నగరంలో శనివారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిన్న, పెద్ద కాలువలు పొంగి పొర్లాయి. డైమండ్ పార్కు వద్ద మురుగు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. మురుగు దుర్వాసన భరించలేక పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించారు. దొండపర్తిలోని కొన్ని ప్రాంతాల్లో కాలువల నుంచి మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. వాన దెబ్బకు సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు సాగక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకొచ్చిన కూరగాయలను పట్టుకుని వెనుతిరిగారు. సీతమ్మధార మెయిన్ రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ బయట నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వర్షం నీరు చేరింది. నక్కవానిపాలెం రోడ్డులో మురుగు నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లింది. రేసపువానిపాలెం, కేఆర్‌ఎం కాలనీ ప్రాంతాల్లోని రహదారి గోతుల్లో నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. క్రాంతినగర్, గాంధీనగర్, 60 ఫీట్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని కాలువలు వాన నీటితో నిండాయి.

ఆక్రమిత దుకాణం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుకాణం వద్ద పలు శాఖల అధికారులు, ఉద్యోగులు

తాటిచెట్లపాలెం : వన్‌టౌన్ ప్రాంతం కురుపాం మార్కెట్ నందు గల దేవదాయ శాఖకు చెందిన ఆక్రమిత దుకాణాన్ని ఆ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వాధీనం చేసుకున్నారు. కురుపాం మార్కెట్‌లో గల 45బి షాపును కోరంగి దేవుడమ్మ ఐదేళ్ల క్రితం బహిరంగ వేలంలో పాడుకున్నారు. అనంతరం ఆమె చెల్లించాల్సిన అద్దె బకాయిపడ్డారు. లీజు కాలం పూర్తి అయినా కూడా షాపు ఖాళీ చేయకుండా కొనసాగుతున్నారు. ఈ విషయమై ఎండోమెంట్ చట్టాన్ని అనుసరించి ఆమెకు రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. శనివారం ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ అధికారి కె. శిరీష, కార్యనిర్వహణాధికారి శేఖర్‌బాబు, ఇతర దేవాలయాల ఈవోలు, సిబ్బంది, వీఆర్వో సాయిప్రకాష్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి. సంతోష్, ఏఎస్‌ఐ ఎంవీ లక్ష్మి, కానిస్టేబుళ్లు ఎస్‌కే రజియా, పి. నీలిమల సమక్షంలో పంచనామా నిర్వహించి సదరు దుకాణాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ బడుల్లో.. స్మార్ట్ తరగతులు

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు ఈసురోమంటూ ఉండేవి. సౌకర్యాల మాట అటుంచితే.. సవ్యంగా పాఠాల బోధన కూడా జరిగేది కాదు. అటువంటి దశలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. నాడు–నేడు వంటి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసింది. విద్యా రంగంలో మరింత ముందుకెళ్లి ఇప్పుడు విద్యార్థులకు 2డీ, 3డీ చిత్రాలతో డిజిటల్ రూపంలో పాఠాల బోధనకు సకల సౌకర్యాలు సమకూర్చింది. కార్పొరేట్‌కు దీటుగా, ఐఐటీ స్థాయి విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో అందించటం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- విద్యార్థులకు ఐఎఫ్‌పీపై బోధన
- చిత్రాలు, గ్రాఫ్‌లతో కళ్లకు కట్టేలా తరగతుల నిర్వహణ
- పాఠాలు సులువుగా అర్థం అవుతున్నాయంటున్న విద్యార్థులు

అల్లిపురం : ప్రభుత్వ పాఠశాలలు స్మార్ట్‌గా మారిపోయాయి. 2డీ, 3డీ చిత్రాలతో డిజిటల్ పాఠాల బోధన జరుగుతోంది. డిజిటల్ టెక్నాలజీతో విద్యా బోధన పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఐఐటీ స్థాయి ఉన్నత విద్యా సంస్థల్లో అందించే విధంగా పాఠశాల స్థాయిలోనే ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ)తో బోధన జరుగుతోంది. వీటిని గ్రీన్‌బోర్డుగా, డిజిటల్ పాఠాలను చూపే టీవీగా ఏకకాలంలో వినియోగించుకునే విధంగా రూపొందించారు. బోర్డుపై రాస్తూనే ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం విశేషం. పాఠ్యాంశాలలోని అంశాలు యానిమేషన్ చిత్రాలతోను, దృశ్య, శ్రవణ మాధ్యమాల్లో విశదీకరిస్తే పిల్లలకు బాగా అర్థం అవుతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ప్యానల్స్ ఒక రకంగా కంప్యూటర్స్ అనే చెప్పుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ మాదిరిగానే ఇవి పని చేస్తాయి. ఇంటర్‌నెట్ ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ప్యానెల్‌పై రాసేందుకు ఒక పెన్ను కూడా సమకూర్చారు. ఉపాధ్యాయులకు జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో శిక్షణ అందజేశారు.



శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు



ఐఎఫ్‌పీ ప్యానల్‌పై బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గ్రీన్‌బోర్డు, చాక్‌పీస్‌లకు స్వస్తి..

దశాబ్దాలుగా ఉపాధ్యాయులు నల్లబోర్డు, గ్రీన్‌బోర్డుపై తెల్ల చాక్‌పీస్‌తో బోధిస్తూ వస్తున్నారు. ఆధునిక విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనకు మనబడి, నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా గూగుల్ అసిస్టెంట్ సదుపాయంతో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ కూడా అందుకోలేని టెక్నాలజీ జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందటం పట్ల అంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పాఠాలు సులువుగా అర్థం అవుతున్నాయి..



ఆండ్రాయిడ్ ప్యానల్స్ కావటం వలన మాకు పాఠాలు సులువుగా అర్థం అవుతున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడంతో మా అనుమానాలను తక్షణమే నివృత్తి చేసుకునే అవకాశం కలుగుతోంది.
– టి.ఢిల్లీ, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

డిజిటల్ ప్యానల్స్‌పై పాఠాలు బాగున్నాయి..



డిజిటల్ ప్యానల్స్‌పై విద్యా బోధనతో పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా చేస్తున్న బోధనతో మా డౌట్స్ సులువుగా తీర్చుకోగలుగుతున్నాం. ఈ విధానం బాగుంది.
–ఒ.చాందిని, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

కార్పొరేట్‌కు దీటుగా..



మేము ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నట్లు లేదు. కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్నట్లు ఉంది. వారికి కూడా అందని టెక్నాలజీ ప్రభుత్వం మాకు కల్పించింది. దీని వలన మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది.
– డి.నిశిత, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

మంచి మార్కులు సాధించవచ్చు..



డిజిటల్ పాఠాల ద్వారా విద్యా బోధన వల్ల మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది. గతంలో పాఠాలు అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేది. ఇప్పుడు డిజిటల్ తరగతుల ద్వారా పాఠాలు సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నాం.
– వై.హర్షవర్ధన్, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

ఐఎఫ్‌పీ ద్వారా అద్భుత బోధన..



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యా బోధన అందిస్తోంది. ఉపాధ్యాయులకు ప్యానెల్స్‌పై బోధన ఎలా చేయాలో తగిన శిక్షణ ఇచ్చారు. అవసరమైతే ఇంటర్ నెట్ ద్వారా కంటెంట్ డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు వివరించగలుగుతున్నాం. బీఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యం కూడా కల్పించారు.
– ఆర్.నాగభూషణం, హెచ్‌ఎం, ఎంజీఎం హైస్కూల్

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 10వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

35వ వార్డు అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న భాస్కరరావు

జగదాంబ : దక్షిణ నియోజకవర్గంలో 35వ వార్డు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శనివారం ఎమ్మెల్యేని కలిసి వార్డు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పూర్ణామార్కెట్ వద్ద గల శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం పూజల్లో సకుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరుతూ ఆహ్వానించారు. అంతకు ముందు కార్పొరేటర్ భాస్కరరావు ఎమ్మెల్యేని శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యేని ఆహ్వానించిన వారిలో దేవస్థానం ధర్మకర్త భక్తి మంగరాజు, దశమంతుల చిన్ని, గుజ్జి సురేష్, శివాజీ తదితరులు ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో అందిన అర్జీల ప్రకారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 30వ వార్డు పరిధి కొత్త జాలరిపేట నివాసి పిల్లా అప్పయ్య, క్లబ్ ప్రాంతంలో నివాసముంటున్న లండా నర్సింగ్, లండా గురయ్యమ్మ పక్షవాతం కారణంగా మంచం పట్టారు. కుటుంబ పోషణ అంతంత మాత్రంగా ఉందని వారి కుమార్తెలు ప్రజాదర్బార్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి నేరుగా వారి ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే తాడివీధిలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త, సచివాలయ కన్వీనర్ గరుగుబిల్లి మణి వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కేజీహెచ్ వార్డుబాయి లేన్ ఏరియాలో నివాసం ఉంటున్న బౌరుశెట్టి రామారావు అనారోగ్యం కారణంగా మంచం పట్టడంతో రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కోన శంకర్, పెంటపల్లి సత్యనారాయణ, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ వద్దాది దిలీప్, దశమంతుల చిన్ని, వెంకట్, రాము, రత్నం, వేణుగోపాల్, ఆదివిష్ణు, లండా రమణ, ముజీబ్‌ఖాన్, ఆరుగుల రాజు, అచ్యుత్, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మక్కా మసీదు నూతన కార్యవర్గం ఎన్నిక

అల్లిపురం : జగదాంబ దరి మక్కా మసీదు నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు ఎస్ఏ మునీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలో అబ్దుల్ మునీర్ ప్యానల్ గెలుపొందినట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎస్ఏ మునీర్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ బరాగ్ అలీ, కార్యదర్శిగా సయ్యద్ అమీర్ జాన్, జాయింట్ సెక్రటరీగా బషీర్ అహ్మద్, కోశాధికారిగా కుతుబ్‌మొహిద్దీన్, సభ్యులుగా నూర్ అహ్మద్, సైపుద్ మాలిక్, టీఎల్ఏ అజీమ్, హస్సన్ షరీఫ్, ఎస్‌కే సాధిక్, ఎండీ గయాజ్ సుభాన్ ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 471 ఓట్లు ఉండగా వాటిలో ఎస్ఏ మునీర్ ప్యానల్‌కు 250, అబ్దుల్ మజీద్ ప్యానల్‌కు 215 వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ మసీదు అభివృద్ధికి అందరినీ కలుపుకుని ఐక్యంగా పోరాడతామని తెలిపారు.

ఘనంగా మదర్, మండల్‌ల జయంతి



మదర్ థెరిసా, బీపీ మండల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్ : బీసీల రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి, ప్రపంచమంతా అమ్మగా పిలిచే మదర్ థెరిసా జయంతి శనివారం ఘనంగా జరిగాయి. ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం దక్షిణ నియోజకవర్గం అధ్యక్షుడు పిల్ల నూకరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పాల్గొని ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ సూచించిన 27 శాతం రిజర్వేషన్ బీసీలకు అమలు కావడం లేదన్నారు. బీసీల అభివృద్ధికి అన్ని బీసీ సంఘాలతో కలిసి పని చేస్తామన్నారు. మదర్ థెరిసా భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సీహెచ్ అప్పారావు, కె. రాధ, బోధనలక్ష్మి, కె. కాత్యాయిని, సత్యనారాయణ, సుబ్బలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల గ్రీవెన్స్‌లో సమస్యల నివేదన



కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : వైఎస్సార్ సీపీ కార్యకర్తల కోసం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. 35వ వార్డు వెలంపేటలో జీ+7 తరహాలో టిడ్కో ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలని, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం చుట్టు దుకాణాలు నిర్మించి నిరుపేద కార్యకర్తలకు జీవనోపాధి కల్పించాలని, ప్రసాద్‌గార్డెన్స్ జీవీఎంసీ గణేష్ పాఠశాల పక్కన ఖాళీ స్థలంలో కమ్యూనిటీ భవన్ నిర్మాణం చేపట్టాలని ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 41వ వార్డు జ్ఞానాపురంలో మరియదాసు కల్యాణమండపం జీ+4 తరహాలో నిర్మాణం చేపట్టి, కార్యకర్తలకు ఇళ్లు కేటాయించాలని, జ్ఞానాపురం బాబూకాలనీలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని వార్డు నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఎమ్మెల్యేని కోరారు. జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు కోడిగుడ్ల శ్రీధర్, కోన శంకర్, పార్టీ నాయకులు ప్రసాదరావు, జెర్రిపోతుల ప్రసాద్, బాపూ ఆనంద్, ముజీబ్‌ఖాన్, బోని దేవా, వద్దాది దిలీప్, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు..

వైభవంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

ప్రజా ఆశీర్వాద యాత్రను జయప్రదం చేయాలి



ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: దక్షిణ నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రను జయప్రదం చేయాలని 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ కోరారు. జీవీఎంసీ 39వ వార్డులో పాతపోస్టాఫీసు వద్ద గల విశాఖ మదీనా దర్గా, చర్చిలు, కనకమహాలక్ష్మి దేవస్థానంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందాలన్న సంకల్పంతోనే ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టామని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే కాకుండా పలు కొత్త సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేశారన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి గెలుపుద్వారా రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మార్గం ఏర్పడుతుందన్నారు. దక్షిణ నియోజవకర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రజలంతా నాంది పలకాలన్నారు. నవరత్నాలలో ఏవైనా పథకాలు అందని వారికి కూడా శుక్రవారం ముఖ్యమంత్రి నిధులు జమ అయ్యేలా చూశారని పేర్కొన్నారు. తన పనితీరు నచ్చితేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని చెప్పిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నమో వేంకటేశ



తిక్కవానిపాలెం వెంకన్న ఆలయంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వర స్వామి

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్ల కంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయంలో భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వెంకన్నను దర్శించుకున్న మేయర్ గొలగాని



వెంకన్న సన్నిధిలో మేయర్ దంపతులు

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వారి పేరిట ప్రధానార్చకులు రామానుజమ్ స్వామికి పూజలు చేశారు.

సంగీత కళాకారుల సేవ వెలకట్టలేనిది



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ఆదినారాయణరావు, శశిప్రభ

సీతంపేట: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'నిన్ను కోరి వర్ణం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అందరినీ అలరించింది. పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు, శశిప్రభ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయనీ గాయకులు, సంగీత వాద్య కళాకారులు కళారంగానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిదని కొనియాడారు. దేశ సంస్కృతి సంప్రదాయంలో కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా భావితరాలు వాటిని అందించవచ్చన్నారు. గాయనీ గాయకులు ఎం.ఎస్. మాధవ్, సి.హెచ్.వి.సత్యనారాయణ, సురేష్‌కుమార్, రాము, రత్నం, లక్ష్మీనారాయణ, నాగ్, అభినయ్, శైలజామెరాజ్, కందర్ప రాధ, జ్యోతి, నిహారిక, లక్ష్మీసాత్విక, రితిక పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. మెలోడీ క్రియేటర్స్ సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కళా సంఘాల ప్రతినిధులు కొణతాల రాజు, ఎస్.వి. విజయకృష్ణ, ఉషా చీరాల తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆంగ్ల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎస్. సాల్మన్ బెన్నీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన, జీవితంలో, సమాజంలోని రుగ్మతలు, సమస్యాత్మక వ్యాధులు, మూఢ నమ్మకాలు, పోలికలు– వైరుధ్యాలు, ఆశతో కూడిన దుర్భర జీవితాలు, అశాంతి, జింగోయిజం, యుద్ధ ప్రభావం, మానవ జీవితంలో వివిధ రూపాల్లో బాధలు వంటి విభిన్న ఇతివృత్తాలను డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ ఉద్వేగభరితంగా వివరించారు.

తెలుగు సినిమా స్థాయిని పెంచిన అవార్డులు



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నెలవారీ చిత్ర ప్రదర్శనలో భాగంగా శనివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలు జాతీయ అవార్డులు పొందిన మల్లేశం తెలుగు సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన 69వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమాలు సత్తా చాటడం గర్వకారణమన్నారు. 69 ఏళ్లలో మొదటి సారిగా తెలుగు నటుడు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం రావడం అభినందనీయమన్నారు. 11 అవార్డులు పొంది తెలుగు సినీ పరిశ్రమ స్థాయిని పెంచిందన్నారు. త్వరలో అవార్డులు పొందిన చిత్రాలతో రాష్ట్ర ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, శ్రీమన్నారాయణ, అనూరాధ, కాశీ విశ్వేశ్వరరావు, చాట్ల బాబూరావు, హుస్సేన్ పాల్గొన్నారు.